
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 6 ఏప్రిల్ 2025





శ్రీకాకుళం : విద్యుత్ వెలుగుల్లో కోదండ రామాలయం

# శ్రీరామనవమి వేడుకలకు వేళాయే!

- అలయాలకు నూతన శోభ
- సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

శ్రీరామనవమిని పురస్కరించుకుని జిల్లాలో రామాలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. శ్రీకాకుళంలో అతి పురాతనమైన కోదండరామాలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆదివారం నుంచి వారం రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు, పలాసలోని అతిపెద్ద ఆలయ సమూహమైన సీతారామ మందిరం, శ్రీకాకుళంలోని బలగ, రెల్లవీధి, ఇలిసిపురం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో ఘనంగా వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

6లో



కల్యాణోత్సవానికి సిద్ధమైన సీతారాముల ఉత్సవమూర్తులు

# రోగులైనా.. మెట్లు ఎక్కాల్సిందే

- రిమ్స్‌లో పనిచేయని లిఫ్టులు
- ఒక్క అటెండర్‌తోనే నిర్వహణ
- పూర్తిస్థాయిలో లేని ఎలక్ట్రీషియన్లు
- విద్యుత్ సమస్యలతో అవస్థలు



రిమ్స్‌లో లిఫ్ట్ పనిచేయకపోవడంతో మెట్ల మార్గంలో వెళ్తున్న రోగులు





మొరాయించిన ఇన్ పేషెంట్ లిఫ్ట్

అరసవల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):

శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్-రిమ్స్)లో సమస్యలు తిష్ట వేశాయి. ఉన్నతాధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ ఆస్పత్రిని సందర్శించి.. ఎన్ని ఆదేశాలు జారీచేసినా తీరు మారని పరిస్థితి నెలకొంది. ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు కరువవుతున్నాయని, వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా లిఫ్టులు పనిచేయకపోవడంతో రోగులైనా సరే అతి కష్టమ్మీద మెట్టు ఎక్కి.. ఆయా విభాగాల వైద్యుల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. రిమ్స్‌లో మొత్తంగా 5 లిఫ్టులు ఉన్నాయి. 24 గంటలు పనిచేయాల్సిన లిఫ్టులకు కేవలం ఒక్క లిఫ్ట్ అటెండర్ మాత్రమే ఉన్నాడు. ఐపీ బిల్డింగ్‌లో లిఫ్ట్ చాలా కాలంగా పనిచేయడం లేదు. రెండు రోజులుగా ఓపీ దగ్గర లిఫ్టులు కూడా మొరాయిస్తున్నాయి. కాలం గడుస్తున్నా.. లిఫ్టుల నిర్వహణకు సంబంధించి కనీస సిబ్బందిని నియమించడం లేదు. లిఫ్టులు పనిచేయక రోగులు మెట్ల మార్గంలోనే నడుస్తూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

## ● ముగ్గురు ఎలక్ట్రీషియన్లతో ఎలా...?

930 పడకల గల రిమ్స్ ఆస్పత్రిలో కనీసం 10 మంది ఎలక్ట్రీషియన్లు ఉండాలి. కానీ రెగ్యులర్ ఒక్కరు, కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ విధానంలో ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఆస్పత్రిలో రెండు భవనాలకు సంబంధించి మొత్తంగా 8 ఫ్లోర్లు ఉన్నాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌తో కలిపి మొత్తం 10 ఉన్నాయి. 23 విభాగాలు, ఐసీయూ కేంద్రాలు 8, ఆపరేషన్ థియేటర్లు 14, వార్డులు 35 ఉండగా కేవలం ముగ్గురు ఎలక్ట్రీషియన్లతోనే నెట్టుకొస్తున్నారు. ఒకవేళ ఎవరైనా సెలవు పెడితే పరిస్థితి మరింత దారుణం. ఆస్పత్రిలోని అన్ని వార్డుల్లోనూ విద్యుత్ బోర్డులకు సంబంధించి పలు సమస్యలు దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల స్విచ్‌లు పనిచేయడం లేదు. ఫ్యాన్‌లు తిరగడం లేదు. అసలే వేసవి కావడంతో ఉక్కపోతతో ఇబ్బందులకు గురవుతున్నామని రోగులు వాపోతున్నారు.

## ● అగ్నిప్రమాదం సంభవిస్తే...

ఆస్పత్రిలో పొరపాటున అగ్నిప్రమాదం సంభవిస్తే అదుపు చేయడానికి కావలసిన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. కానీ వాటిని వినియోగించేందుకు సిబ్బంది ఒక్కరూ లేకపోవడం గమనార్హం. కనీస సిబ్బంది లేకుండా ఇంత నిర్లక్ష్యంగా ఎలా రోజులు నెట్టుకొస్తున్నారో.. అధికారులు, నాయకులకే తెలియాలి.

## ● ప్లంబర్ ఒక్కడే.?

ఆస్పత్రి మొత్తానికి (మిగతా 6వ పేజీలో..)



జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేంద్ర,రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

# బాబూ జగ్జీవన్‌రామ్.. మహనీయుడు

- ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నాం: కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- శ్రీకాకుళంలో కాంస్య విగ్రహావిష్కరణ ● ఘనంగా జయంతి

అరసవల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): 'బాబూ జగ్జీవన్‌రామ్.. అసమానతలు లేని సమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడు. ఆయన ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నామ'ని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని శ్రీకాకుళంలోని అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద కాంస్యవిగ్రహాన్ని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి కేంద్రమంత్రి ఆవిష్కరించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ 'కుల వివక్ష సమాజంలో.. చదువు ఒక్కటే మన జీవితాలను మార్చగలిగే ఏకైక శక్తి అని జగ్జీవన్‌రామ్ నమ్మారు. ఉన్నత చదువులను అభ్యసించి, ఉప ప్రధాని పదవిని చేపట్టిన తొలి దళిత నాయకుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. రక్షణమంత్రిగా పాకిస్థాన్‌తో యుద్ధ సమయంలో కీలక పాత్ర పోషించారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిగా హరిత విప్లవాన్ని సృష్టించి, వ్యవసాయాన్ని, రైతాంగాన్ని ఆదుకున్న మహానాయకుడ'ని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కోరారు. శ్రీకాకుళం నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

● మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'జగ్జీవన్‌రామ్ జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి. అమరావతిలోని 11 ఎకరాల్లో ఆయన స్మృతివనం (మిగతా 7వ పేజీలో..)



నిరసన వ్యక్తం చేస్తున్న దినసరి ఉద్యోగులు

# ఆదిత్యాలయంలో.. 'ఆకలి' బాధలు

- దినసరి వేతన ఉద్యోగులు విధుల బహిష్కరణ
- 14 నెలలుగా జీతాల్లేవని ఆవేదన
- అన్నదాన కేంద్రంలో భక్తులకు తప్పని నిరీక్షణ
- వారం రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా

అరసవల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లిలోని ఆదిత్యాలయంలో శనివారం ఆకలి బాధలు కనిపించాయి. 14 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో అర్ధాకలితో అలమటిస్తున్నామంటూ దినసరి వేతన ఉద్యోగులు విధులు బహిష్కరించడంతో కౌంటర్లన్నీ మూతపడ్డాయి. ఫలితంగా అన్నదాన కేంద్రం వద్ద భోజనం కోసం భక్తులు గంటల తరబడి నిరీక్షించి.. ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకి (మిగతా 6వ పేజీలో..)



అన్నదాన కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న భక్తులు

## ఒక వైపు వేశారు.. మరోవైపు వదిలేశారు

- బెండి వద్ద అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు
- ఇదీ పూండి- పర్లాకిమిడి ఆర్‌అండ్‌బీ రోడ్డు పనుల దుస్థితి

8లో

## ఈదురు గాలుల బీభత్సం

- నేలకొరిగిన స్తంభాలు, రేకుల షెడ్లు

6లో

## జిల్లాకు పిడుగుల ముప్పు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

7లో

# కొనుగోలుదారులేరీ?

- పెరిగిన జీడిపప్పు ధరలు ● తగ్గిన విక్రయాలు
- తాత్కాలికంగా పరిశ్రమలు మూత ● కొత్త జీడి పిక్కలపైనే ఆశలు



ఉద్దానంలో ఏపుగా కాసిన జీడి పిక్కలు

పలాస, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):

కొత్త తెలుగు సంవత్సరంలోకి అడుగు పెట్టిన జీడి వ్యాపారులకు ఆదిలోనే హంసపాదు ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జీడిపప్పు ధరలు పెరగడంతో కొనుగోళ్లు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమలను తాత్కాలికంగా బంద్ చేయాల్సి వస్తోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వచ్చే కొత్త జీడి పంటపైనే ఆశలు పెట్టుకున్నారు. సాధారణంగా జీడి వ్యాపారమంటే లాభసాటిగా ఉంటుందని అంతా భావిస్తారు. వేలాదిమంది కార్మికులు, వందలాది వ్యాపారులతో పలాస మార్కెట్ కళకళలాడుతుండేది. కానీ ప్రస్తుతం తలకిందులయ్యే పరిస్థితికి వచ్చింది. జీడిపిక్కల కొనుగోలు ధర కంటే తయారీకే అదనంగా ఖర్చవడంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. 80 కిలోల జీడిపిక్కల నుంచి 20 కిలోల వరకూ జీడిపప్పు వస్తుంది. ప్రస్తుత మార్కెట్ ప్రకారం అన్నిరకాలు కలిపి సరాసరి కిలో రూ.770కు హోల్‌సేల్‌గా పడుతుంది. అంత మొత్తం ధర చెల్లించి జీడిపప్పు కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో తయారైన పప్పు మార్కెట్‌లో ధర పెరిగే వరకూ వ్యాపారులు నిల్వ ఉంచుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం చిన్న వ్యాపారులు పూర్తిగా జీడిపప్పు ప్రాసెసింగ్ నిలుపుదల చేశారు. పెద్ద వ్యాపారులు 50 మంది వరకూ తయారైన జీడిపప్పు అమ్మకం లేక పరిశ్రమల వద్దే నిల్వ ఉంచుతున్నారు.

### అంతా అయోమయం


జీడి సీజను ఉగాది నుంచి సాధారణంగా ప్రారంభమవుతోంది. ఈ ఏడాది కొత్త జీడిపిక్కలపైనే వ్యాపారులంతా ఆశతో ఎదురుచూస్తున్నారు. ఉద్దానం గ్రామాల్లో జీడిపిక్కల మద్దతు ధర కోసం ఇప్పటికే ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త పిక్కల ధరలు ఏ మేరకు ఉంటాయో తెలియని పరిస్థితిలో వ్యాపారులు ఉన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో దేశీయరకం జీడి పిక్కలు బస్తా(80 కిలోలు) ధర రూ.12,400 వరకూ పలుకుతోంది. కనీస మద్దతు ధర రూ.16వేలు ఇవ్వాలని జీడిరైతులు ఉద్యమిస్తున్నారు. ఇప్పటికే తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నామని, మద్దతు ధర రూ.16వేలకు పెంచితే తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. కొత్త పిక్కలు మార్కెట్‌లోకి వచ్చినప్పుడు సాధారణ ధరకు అమ్మడం సహజం. దాని ప్రకారమే కొనుగోలు చేసుకుంటే ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కగలమని వ్యాపారులు భావిస్తున్నారు. ఈ ఏడాది జీడి పంట ఆశాజనకంగా ఉండడంతో వ్యాపారులు, రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు.



వజ్రపుకొత్తూరు: నువ్వలరేవులోని శ్రీరాముని ఆలయం



శ్రీకాకుళంలో కల్యాణ వేదికకు అలంకరణ



# నవమి వేడుకలకు వేళాయె

● ఆలయాలకు నూతన శోభ ● సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

**శ్రీరామ నవమి వేడుకలకు జిల్లాలోని రామాలయాలు సిద్ధమయ్యాయి. ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఉత్సవాలు... సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.**

## 300 ఏళ్లుగా శ్రీరామ నవమి వేడుకలు

● ఇదీ నువ్వలరేవు ప్రత్యేకత

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నువ్వలరేవులో ఉన్న కేవిటీలు శ్రీరాముని భక్తులు. వీరు 300 ఏళ్ల క్రితం ఒడిశా ప్రాంతం నుంచి ఉపాధి కోసం ఈ ప్రాంతానికి వలస వచ్చినట్లు పూర్వీకులు చెబుతారు. అప్పటి నుంచి ఇక్కడ శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందువలనే కేవిటీలు రాష్ట్రంలో నువ్వలరేవులోనే కనిపిస్తారు. గ్రామంలో శ్రీరాముని ఆలయం నిర్మించి... ఏటా తొమ్మిది రోజుల పాటు నవమి వేడుకులను ఘనంగా నిర్వహిస్తారు. 300 ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కరోనా సమయంలో ఉత్సవాలు లేకున్నా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నువ్వలరేవు గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయంలో పూజలు నిర్వహిస్తూంటారు. జిల్లాలోని అతి పురాతన శ్రీరామ ఆలయంలో నువ్వలరేవు ఒకటి. ఆలయం శిథిలమవడంతో 30 ఏళ్ల క్రితం గ్రామస్తులు పునర్నిర్మించారు.

### విద్యుత్ కాంతులు..

శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా గ్రామంలో ముఖద్వారంతో పాటు అన్ని వీధులలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఏటా తొమ్మిది రోజుల పాటు ఇక్కడ వేడుకలు చేస్తారు. చివరి రోజు రావణ దహనం భారీ స్థాయిలో నిర్వహిస్తారు.



వజ్రపుకొత్తూరు: నువ్వలరేవులో విద్యుత్ దీపాల అలంకరణ

### అతి పురాతన రామాలయం..

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండరామాలయం అతి పురాతనమైనది. 1826లో అద్దమడుగుల వెంకన్న పంతులు, వెంకుబాయమ్మ దంపతుల ఆధ్వర్యంలో కోదండ రామాలయం నిర్మించినట్లు పూర్వీకులు చెబుతున్నారు. చిన్న జీయర్ స్వామి తాతపెద్దజీయర్ స్వామి అప్పట్లో ఈ మందిరాన్ని దర్శించుకున్నారని పెద్దలు చెబుతున్నారు. ఈ ఆలయానికి అప్పట్లోనే 486 ఎకరాల భూముల ను రాసిచ్చినట్లు పత్రాలు ఉన్నాయి. కానీ ప్రస్తుతం అవి కొంతమంది చేతిలో ఉన్నట్టు అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు తెలిపారు.

### రామస్థూపం..

1962లో పెద్ద జీయర్ స్వామి ఆధ్వర్యంలో దేశం మొత్తం మీద 362 రామ స్థూపాలను నిర్మించారు. అందులో ఒకటి ఇక్కడ ఉంది. ఇలాంటి సూపాఆలు జిల్లాలోని కళింగపట్నం, శ్రీకాకుళం, శ్రీకూర్మం, నరసన్నపేట, ఆమదాలవలసలో కూడా ఉన్నాయని తెలిపారు.

### నవమి వేడుకలకు సన్నాహాలు..

ఈ నెల 6 నుంచి కోదండ రామాలయంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 6న శ్రీరామ జనన ఘట్ట పారాయణం, సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 8 నుంచి 13 వరకు రామ చంద్రస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాలు, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామని ఆ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలలో భాగంగా అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో శ్రీరాముడిని వరుడిగా, సీతమ్మను వధువుగా శనివారం అలంకరించారు.

## అతిపెద్ద ఆలయ సమూహం

● కంచి పీఠాధిపతి సూచనతో గుడి నిర్మాణం

● పలాసలో వేడుకలకు ఏర్పాట్లు పూర్తి





సీతారాముల ప్రధాన ఆలయ సమూహం

పలాస, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంచి పీఠాధిపతి, దివంగత చంద్రశేఖరస్వామి ఆదేశించిన విధంగా పలాస రైల్వే స్టేషన్ రోడ్డులో శ్రీసీతారామ మందిరాన్ని 50 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ భద్రాద్రి రాములోరిలా నిత్య కల్యాణం-పచ్చతోరణంగా విరజిల్లుతోంది. 50 ఏళ్ల సంబరాల్లో భాగంగా ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో శోభయామనంగా మారింది. శ్రీరామ నవమి వేడుకలకు ఈ ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. చంద్రశేఖర స్వామి వారు అప్పట్లో కాలినడకన కాశీ యాత్ర చేసిన సమయంలో పలాసలో విడిది చేశారు. రైల్వే స్టేషన్ రోడ్డులో ప్రస్తుతం రామాలయం ఉన్న ప్రాంతంలో మర్రి, రావిచెట్లు ఉండేవి. ఆ ప్రాంతంలో ఆయన బసచేసి... ఇక్కడ రామాలయం నిర్మిస్తే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని చెప్పడంతో అప్పటి పెద్దలు సీతారామాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భక్తుల సంఖ్య పెరగడం, ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పడడంతో ప్రస్తుతం సీతారామాలయం, షిర్డి సాయిబాబా ధ్యాన మందిరం, ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం, జగన్నాథ మందిరం, లక్ష్మి, గణపతి, సరస్వతి, సత్యనారాయణస్వామి, వీరాంజనేయ, కార్తికేయ మందిరాలు నిర్మించారు. పలాస డివిజన్‌లో అతిపెద్ద ఆలయ సమూహంగా శ్రీసీతారామాలయ ప్రాంగణం వెలుగొందుతోంది.

### ముత్యాల తలంబ్రాలతో...

ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణం నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. వాటిని భక్తులకు కానుకగా ఇస్తారు. ముత్యాలు ఇచ్చేందుకు స్థానిక భక్తులు పోటీ పడుతుండడం విశేషం. ఉత్సవ మూర్తులను ఉగాది రోజున ఆరు బయటకు తీసుకువచ్చి... శ్రీరామ నవమి వరకూ ప్రత్యేక పూజలు చేస్తారు. నవమి నాడు స్వామివారి ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహిస్తారు. ఈ వేడుక చూసేందుకు చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. 50 వసంతాల సీతారాముల ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

### ఘనంగా వేడుకలు..

హరిపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మందస మండలం హరిపురంలో శ్రీరామ నవమి వేడుకలను శనివారం ఘనంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలలో భాగంగా సీతారామ లక్ష్మణ దేవతామూర్తులను వేదపండితులు మద్దిబట్ల శాంతారావు శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు పూర్ణకుంభాలతో స్వామికి ఆహ్వానం పలికారు. దత్తాత్రేయ ఆలయం నుంచి పెద్దవీధిలోని శ్రీరామ మందిరం వరకు మహిళలు పూర్ణకలశాలతో ఊరేగింపుగా వెళ్లారు. ఆదివారం స్వామి కల్యాణోత్సవం, మంగళవారం దేవతా మూర్తుల ఊరేగింపు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం మహిళల కోలాటం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కలశాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు

## రోగులైనా.. మెట్లు ఎక్కాల్సిందే

(ఐదో పేజీ తరువాయి)

ఒక్కరే ప్లంబర్ పని చేస్తున్నాడు. తాగునీటి ప్లాంట్‌లు, బాత్‌రూమ్‌లు, పైపులైన్ల మరమ్మ తుల పనులు ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు. పారిశుధ్య లోపం, నీటి సరఫరా సక్రమంగా లేక రోగులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. వైద్యసేవలు మాట దేవుడెరుగు.. ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నా మని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో సమస్యల పరిష్కారా నికి చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

### త్వరలోనే పరిష్కారం..

ఆస్పతిలో ఎలక్ట్రికల్, లిఫ్ట్‌లకు సంబంధించి అదనపు సిబ్బంది అవసరమని గుర్తించాం. ఇప్పటికే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయి.

- డాక్టర్ షకీలా, సూపరింటెండెంట్, జీజీహెచ్

## ఆదిత్యాలయంలో.. 'ఆకలి' బాధలు

(ఐదో పేజీ తరువాయి)

వెళితే.. అరసవల్లి ఆదిత్యాలయంలో 49 మంది దినసరి వేతన ఉద్యోగులు శనివారం ఉదయం విధులను బహిష్కరించారు. '14 నెలలుగా జీతాలు చెల్లించకుండా మాతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. జీతాల కోసం అడిగితే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. జీతాలు లేక ఆకలితో అలమటిస్తున్నాం. కుటుంబ పోషణ కోసం ఒక దినసరి ఉద్యోగి భిక్షాటన చేసి.. చివరకు ఆవేదనతో ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు మానసిక ఒత్తిడికి గురై ఆస్పత్రుల పాలయ్యారు. ఈవోలు తరచూ మారుతుండడం, వచ్చిన అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించడమే ఈ స్థితికి కారణమ' దినసరి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

### కౌంటర్లు ఖాళీ..

దినసరి వేతన ఉద్యోగుల నిరసన నేపథ్యంలో ఆలయంలో కౌంటర్లు తెరచుకోలేదు. ప్రసాదాల కౌంటర్లు, రూ.100, రూ.300 టిక్కెట్లు అమ్మకం సాగించే కౌంటర్లు, సమాచార కేంద్రం, సేవా కౌంటర్లు, డొనేషన్ల కౌంటర్లు, కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు హాజరు కాకపోవడంతో అన్నీ ఎక్కడికక్కడే స్తంభించిపోయాయి. దీంతో ఈవో వై.భద్రాజీ, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ వారిని కార్యాలయానికి పిలిపించి చర్చలు జరిపారు. ఈ విషయమై ఇప్పటికే దేవదాయశాఖ కమిషనర్‌కు విన్నవించామని, త్వరలోనే అందరికీ జీతాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, విధులకు హాజరు కావాలని ఈవో భద్రాజీ నచ్చజెప్పారు. వారంతా శాంతించి మళ్లీ విధులకు హాజరయ్యారు. ప్రసాదాల తయారీ, అన్నదానం వద్ద ఉదయం 10.30 తరువాత పనులు ప్రారంభించారు. దీంతో అన్నప్రసాద వితరణ ఆలస్యంగా ప్రారంభమైంది. కొందరు భక్తులు గంటల తరబడి నిరీక్షించి ఆకలితో ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి దినసరి వేతన ఉద్యోగుల సక్రమంగా జీతాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

### మంత్రి అచ్చెన్న దృష్టికి..

ఆదిత్యాలయంలో సేవలందిస్తున్న సుమారు 35మంది దినసరి ఉద్యోగులు శనివారం సాయంత్రం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడుని కలిశారు. జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని తమ బాధలను విన్నవించారు. మంత్రి తక్షణమే స్పందిస్తూ ఎమ్మెల్యే గొండు శంకర్, ఈవో వై.భద్రాజీతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దేవదాయశాఖ కమిషనర్‌కు ఫోన్‌చేసి వారి పెండింగ్ జీతాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నందున సోమవారం ఆఫీసుకు వచ్చిన వెంటనే జీతాలు విడుదలకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు వారం రోజుల్లో జీతాలు అందజేస్తామని మంత్రి అచ్చెన్న దినసరి ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. తమ సమస్యపై తక్షణమే స్పందించిన మంత్రి అచ్చెన్నకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ఈదురుగాలుల బీభత్సం

● నేలకొరిగిన స్తంభాలు, రేకుల షెడ్లు

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో బలమైన ఈదురు గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పెద్దపెద్ద శబ్దాలతో ఉరమడంతో ఇళ్లలో ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు. ఈదురు గాలులకు కొత్తపేట గ్రామ సమీపంలో గల పంట పొలాల్లోని విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రావిచెంద్రి గ్రామంలోని రేకుల షెడ్డులు నేల మట్టమయ్యాయి. కోవిలాం సమీపంలో కోతకు వచ్చిన పంట నేలకొరిగింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అధిక పెట్టుబడులు పెట్టి... పండించిన పంట చేతికందిన సమయంలో నష్టం జరిగిందని... అప్పులను ఎలా తీర్చాలో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

### ఈదురుగాలులతో వర్షం..

నందిగాం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులతో కూడిన వర్షం శనివారం మధ్యాహ్నం పడింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు, గాలులతో ఒక మాదిరి వర్షం పడడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే వరిచేను కోతలు కోసి... ఆరబెట్టారు. వర్షంతో ధాన్యం తడిసిపోయాయి. మరోవైపు మామిడి, జీడి వంటి పంటలకు కూడా కొంత నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



నందిగాంలో వర్షం పడుతున్న దృశ్యం



నందిగాంలో ఎండబెట్టిన ధాన్యాన్ని పోగుచేస్తున్న రైతులు

### శ్రీముఖలింగంలో..



శ్రీముఖలింగంలో పడుతున్న వర్షపు జల్లులు

జలుమూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) మండలం శ్రీముఖలింగం పరిసర గ్రామాల్లో శనివారం సాయంత్రం తేలికపాటి వర్షం పడింది. ఉదయం భానుడు భగ భగకు వేడిమికి ప్రజానీకం అల్లాడగా సాయంత్రం పడిన తేలికపాటి వర్షానికి వాతావరణం చల్లబడి జనాలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షం రబీ వరి పండించే రైతులకు మేలు చేయగా, మొక్కజొన్న రైతులకు నష్టం కలిగింది. ఈ వర్షం వలన రబీ వరి రైతులు ఆనందం వ్యక్తం చేసారు. అలాగే పూత దశలో ఉన్న నువ్వు పంటకు ఈ వర్షం ఉపయోగపడింది.



పట్టుపురం వద్ద కొబ్బరి చెట్టుపై పిడుగుపడి మంటలు రేగిన దృశ్యం



ఎల్ఎన్ పేట: కొత్తపేట సమీపంలో నేలకొరిగిన విద్యుత్తు స్తంభం



ఎల్ఎన్ పేట: రావిచెంద్రిలో కూలిన రేకుల షెడ్డు

### మెళియాపుట్టిలో...

మెళియాపుట్టి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం ఉక్కపోతతో అల్లాడిన జనం సాయంతరం వర్షంతో కాస్త ఊరట చెందారు. పట్టుపురం గ్రామానికి చెందిన పొట్నూరు మోహనరావు ఇంటి పెరటిలో ఉన్నా కొబ్బరి చెట్టుపై పిడుగుపడి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో పెద్దప్రమాదం తప్పింది ఈ ఏడాది మామిడి పంట అంతంతమాత్రంగానే ఉంది. ఈదురు గాలులతో అనేక గ్రామాల్లో పంట నేలరాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



మెళియాపుట్టిలో వర్షం ఇలా..



నదీ జలాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు

## వైభవంగా శ్రీరామ మందిర ప్రారంభోత్సవం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఈదుపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఈదుపురం గ్రామ మహిళలు బాహుదా నది నుంచి బిందెలతో నీటిని తెచ్చి తిరువీధి నిర్వహించారు. సీతారామ లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలకు జలాధివాసం చేశారు. సుమారుగా వెయ్యి మంది మహిళలు ఇళ్ల ముందు కలశ స్థాపన చేశారు. మధ్యాహ్నం వందలాది మంది మహిళలు బాహుదా నదికి వెళ్లి పవిత్ర జలాలను తీసుకొచ్చి దేవతామూర్తులను ఊరేగించి.. అనంతరం జలాధివాసం చేశారు. ఆది వారం నవమి సందర్భంగా స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు చేస్తారు. ఆదివారం ఉదయం మందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు.

# దివ్యాంగ పిల్లలను ప్రోత్సహించాలి

● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

అరసవల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పిల్లలను పోత్సహిస్తే వారు అద్భుత విజయాలు సాధిసారని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ భవన ప్రాంగణంలో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉపకరణాలు రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం, పాతపట్నం ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను చదువుల్లో తల్లిదండ్రులు పోత్సహించాలని, వారి విజయంలో కీలక పాత్ర తల్లిదండ్రులదేనన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుకోవడంపై దృష్టి పెడతామన్నారు. జిల్లాలో దివ్యాంగుల కోసం ప్రతీ నెలా మూడో శుక్రవారం కలెక్టర్ సమక్షంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెరుగైన సౌకర్యాలతో కూడిన నూతన భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, నాయకులు పైడిశెట్టి జయంతి, తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన చికిత్స అందించాలి



మంచు ఐకేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

అరసవల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కంటి వ్యాధులకు మెరుగైన చికిత్స అందించాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావుతో కలిసి నగరంలో మంచు ఐకేర్ సెంటర్‌ను శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్ లో కంటి చికిత్సలకు సంబంధించి ఉత్తమమైన సేవలు అందుతు న్నాయని, మన శ్రీకాకుళంలో కూడా మెరుగైన సేవలందేలా కృషి చేయాలని కోరారు. జిల్లా అభివృద్ధి చెందుతోందని, వైద్య రంగంలో వస్తున్న అనేక కొత్త టెక్నాలజీలను ఇక్కడి వైద్యులు అందిపుచ్చుకోవడం అభినందనీయమన్నారు. మంచు ఆసుపత్రి చీఫ్ వాసుదేవరావు మాదిరిగానే నగరంలోని అనేకమంది వైద్యులు ముందుకొస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ వైద్యులు జగన్మోహనరావు తదితరులు హాజరయ్యారు.

## జిల్లాకు పిడుగుల ముప్పు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం తుఫాన్ ప్రభావం లేనప్పటికీ జిల్లాలో పిడుగులు పడే అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజలను హెచ్చరించారు. శనివారం సాయంత్రం అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీని ప్రభావంతో పిడుగులు పడే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, సెలవులను తక్షణమే రద్దు చేస్తున్న ట్లు ప్రకటించారు. వచ్చే 48 గంటల పాటు కలెక్టరేట్‌లో 08942-20557 ఫోన్ నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే ప్రజలు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు. ప్రత్యేకించి సోంపేట మండలంలో వర్షం తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని, మత్స్యకారులు రానున్న రెండు రోజుల పాటు సముద్రంలో వేటకు వెళ్లొద్దని స్పష్టం చేశారు. పిడుగులు పడే సమయంలో చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని, రైతులు, కూలీలు, పశువుల కాపరులు సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు.

## ఆకట్టుకున్న సాంఘిక నాటకం



నాటకంలోని ఓ సన్నివేశం

ఆమదాలవలస, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): లొద్దలపేట గ్రామంలో సీతారామ ఆలయ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో గ్రామానికి చెందిన యువత పలు సాంఘి నాటకాలు ప్రదర్శిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఇదే గ్రామానికి చెందిన ఎస్.వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రదర్శించిన సైనికుడు-2 నాటక ఆకట్టుకుంది. ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితి ఉటకిస్తూ ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను కట్టిపడేసింది. అదే విధంగా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా వందమంది దంపతులతో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

## కంపోస్టు పిట్‌లతో నేల సారవంతం



మాట్లాడుతున్న ఏపీడీ రాధ

సరుబుజ్జిలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కంపోస్టు పిట్‌లు అధికంగా ఏర్పాటు చేయాలని ఉపాధి ఏపీడీ పంచాది రాధ తెలిపారు. శనివారం మూలసవలాపురం, తురకపేట గ్రామాల్లో పర్యటించారు. సేంద్రియ వ్యర్థాలను కుళ్లించి ఎరువుగా మార్చేందుకు కంపోస్టు పిట్‌లు ఉపయోగపడతాయని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రక్రియలో వ్యర్థాలు సూక్ష్మ జీవులు ద్వారా విచ్ఛిన్నమై నేల సారవంతంగా మారుతుందన్నారు. ఈ పరిశీలనలో వెలుగు ఏపీఎం గోవిందరాజులు, ఏపీవో బొత్స పార్వతి, ఈసీ రమాదేవి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌వోబీల కోసం సర్వే

● 10రోజుల్లో టెండర్లు



అంపురం వద్ద స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం/కంచిలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నుంచి పలాస వరకు మంజూరైన 12 ఆర్‌వోబీలు (రోడ్ ఓవర్ బ్రిడ్జులు) నిర్మాణ పనులకు పది రోజుల్లో టెండర్లు ప్రక్రియ ప్రారంభం అవుతుందని ఈస్‌కోస్ట్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ నాయక్ తెలిపారు. శనివారం 12 ఆర్‌వోబీల స్థలాలను పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ సుకన్య, పంచాయతీ రాజ్ విభాగం చీఫ్ ఇంజనీర్ బాలు నాయక్ అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ స్పెషల్ ఏఈ బి.ధనుంజయ, రైల్వే జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు శ్రీనివాస్ రౌలో, ఇంజనీర్లు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## 8 నుంచి ముత్యాలమ్మతల్లి జాతర



పోస్టర్లను ఆవిష్కరించిన దృశ్యం

రణస్థలం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జేఆర్ పురం పంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మతల్లి జాతీర ఈ నెల 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనుందన్నారు. భక్తుల వినోదం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు.

## విద్యార్థుల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అశోక్

కవిటి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు యాజమాన్య కమిటీ, గ్రామస్థులు కృషిచేయాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కోరారు. రామయ్యపుట్టుగలో కవిటి, ఇచ్ఛాపురం మండలాల పాఠశాల యాజమాన్య కమిటీ, ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. విద్యావ్యవస్థలో తీసుకోబోయే సంస్కరణలతో గ్రామాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల వల్ల విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఇచ్ఛాపురం నియోజక వర్గంలో కొత్త విద్యావిధానం ద్వారా పాఠశాలలు గ్రామాల్లో ఎత్తివేస్తారని చెప్పి ఇప్పటికే తనకు 29 గ్రామాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఒరియా మీడియం పాఠశాలలు కుదింపు కాకుండా చేయాలని ఒడియా అసోసియేషన్ అధ్యక్షుడు కేశవ పురియా కోరారు. సమావేశంలో ఇచ్ఛాపురం, కవిటి ఎంఈవోలు కె.అప్పారావు, ధనుంజయ మజ్జి తదితరులు పాల్గొన్నారు.

## బారువ బీచ్ పరిశీలన



బీచ్‌లో పర్యటిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

సోంపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బారువ బీచ్‌లో త్వరలో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్స్ సంబంధించి ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శనివారం పరిశీలించారు. అనంతరం బీచ్‌లో ఉన్న ఆలీవ్ రిడ్లే తాబేలు పొదుగు స్థలాన్ని, బీచ్ రిసార్ట్, మహేంద్రతనయ నది సముద్రంలో కలిసే స్థలం పరిశీలించారు. పలాస ఆర్డీవో జి.వెంకటేష్, తహసీల్దార్ బి.అప్పలస్వామి, డీటీవో నారాయణరావు, ఎఫ్ఆర్‌వో మురళీకృష్ణనాయుడు ఉన్నారు.

## రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం




ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో సాయి ప్రత్యూష

ఆమదాలవలస, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వే ద్వారా అన్ని భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష అన్నారు. శనివారం కట్టాచార్యులపేట గ్రామంలో తహసీల్దార్ రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన రీసర్వే ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో రీసర్వే అవసరాలను తెలియజేస్తూ ఆర్డీవోతో పాటు రెవెన్యూ అధికారులు ర్యాలీ నిర్వహించి అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామసభలో ఆర్డీవో మాట్లాడుతూ.. భూ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ఈ రీసర్వే కార్యక్రమాన్ని రైతులకు ఎటువంటి సమస్యలున్నా అర్జీలు ఇచ్చి సమస్యల పరిష్కారంతో ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులతో పాటు సర్వే విభాగానికి చెందిన అధికారులు, అన్ని రకాల భూములకు హద్దులు నిర్ణయించడంతో పాటు భూముల స్వభావాన్ని నిర్ధారించడం జరుగుతుందన్నారు. కార్య క్రమంలో డీటీ శ్రీనివాసరావు, సర్వేయర్ గోపి, సర్పంచ్ ఎన్ని రామచం ద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

ఆమదాలవలస, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పొన్నంపేట గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా శనివారం మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చన పూజలు చేపట్టారు. గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని లలితా సహస్ర నామ కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

## బాబూ జగ్జీవన్‌రామ్.. మహనీయుడు

(ఐదో పేజీ తరువాయి)

ఏర్పాటు నిర్మిస్తాం. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన పదవులు ఇచ్చేందుకు కృషి చేస్తున్నా'మని తెలిపారు.

● ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. 'బాబూ జగ్జీవన్‌రామ్ అత్యధిక సార్లు పార్లమెంటేరియన్‌గా, చిన్న వయసులోనే కేంద్రమంత్రిగా పనిచేసిన గొప్ప నాయకుడు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనుభావుడు. ఆయన ఆశయాలను కొనసాగించాల'ని పిలుపునిచ్చారు.

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. రక్షణ, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేసిన దార్శనికుడు, విజ్ఞానవేత్త, సమసమాజ నిర్మాత బాబూ జగజ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, దళిత నాయకులు బోసు మన్మథరావు, రాంగోపాల్ మాస్టారు, రమణ మాదిగ, కంఠ వేణు, గోర సురేష్, చౌదరి బాబ్జీ, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, అరవల రవీంద్ర, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, మెండ దాసునాయుడు, కొర్ను ప్రతాప్, పీఎంజే బాబు, సీర రమణయ్య, కవ్వాడి సుశీల, చిట్టి మోహనరావు పాల్గొన్నారు.

## ఎన్ని దుంపలో..



ఒకే చెట్టుకు కాసిన దుంపలను చూపిస్తున్న రైతు నీలకంఠం

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినవంక గ్రామంలోని ఓ రైతు తోటలో భారీ కర్ర పెండలం దుంప బయట పడింది. తీర ప్రాంతంలోని ఇసుక నేలలో కర్ర పెండలం విరివిగా సాగు చేస్తుంటారు. వేసవిలో అంతర పంటగా తక్కువ ఖర్చుతో దుంపలను పండిస్తుంటారు. ఈ క్రమంలో చినవంక గ్రామానికి చెందిన రెయ్య నీలకంఠం అనే రైతు తోటలోని ఒక చెట్టులో 10 కిలోలకు పైబడి దుంపలు కాసింది. సాధారణంగా ఒకచెట్టుకు రెండు, మూడు దుంపలు కాస్తాయి. ఈ చెట్టుకు 13 దుంపలు ఉండడం విశేషం. అందులో పెద్ద దుంప రెండు కేజీలు ఉందని చెప్పారు. మిగతా చెట్లకు మాత్రం సాధారణ పరిమాణంలోనే దుంపలు వచ్చాయని నీలకంఠం తెలిపారు.

## పూర్తయ్యేదెప్పుడో?

● అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు



సుబ్బపేట అంగన్‌వాడీ భవనం దుస్థితి

సరుబుజ్జిలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఇసుకలపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సుబ్బపేట, ఇసుకలపాలెం గ్రామాలకు గత టీడీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. అయితే 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం వీటి నిర్మాణాలపై పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో నేటికీ అర్థాంతరంగానే నిలిచిపోయాయి. 2014-2019 తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో రెండు గ్రామాలకు అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడంతో పాటు ఇసుకలపాలెం శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. అయితే అప్పట్లో నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు అంగన్‌వాడీ భవనాలు రెండు చివరిస్థాయి వరకు నిర్మాణాలు పూర్తి చేసి తుదిదశలో వదిలేశారు. అలాగే ఇసుకలపాలెం శ్మశాన వాటిక కూడా నిర్మాణ పనులు అసంపూర్తిగా నేటికీ దర్శనమిస్తున్నాయి. ఈ మూడు నిర్మాణాల కాంట్రాక్టర్లు నిర్మాణ పనులకు సంబంధించి కొంతమేర నిధులు చెల్లింపులు వైసీపీ పాలనలో చేయించుకోవడం జరిగిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ పర్యవేక్షించిన అధికారులు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు కనీసం పట్టించుకోకపోవడంతో అసంపూర్తిగా ఎక్కడ నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. దీనితో ఇసుకపాలెం శ్మశాన వాటికలో అసంపూర్తిగా నిర్మాణాలు జరిగిన కొన్ని నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అంతేకాకుండా నిర్మాణాలు ఆగిపోవడంతో శ్మశాన వాటిక పరిసర ప్రాంతమంతా ముళ్లపొదలతో నిండిపోయి గ్రామంలో ఎవరు మరణించినా అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు సమగ్ర రక్షణ పర్యవేక్షలో నిర్వహించాల్సిన పలు కార్యక్రమాలు అంగన్‌వాడీ కేంద్ర భవనాలు లేక చాలా గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడేళ్ల నుంచి అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు ఉండిపోవడంతో ప్రారంభం కాకముందే భవనాలు శిథిలావస్థకు చేరుకొని ప్రభుత్వ నిధులు దుర్వినియోగంగా మారుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజా ప్రతిని ధులు చర్యలు తీసుకొని ఇసుకల పాలెం పంచాయతీలో అర్థాంత రంగా ఆగిపోయిన ప్రభుత్వ వస తుల నిర్మాణాలను పూర్తి చేయడానికి కృషి తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



జాతరలో పాల్గొన్న భక్తులు

## ఘనంగా కొఠారి చండీమాత యాత్ర



కవిటి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వింధ్యగిరి గ్రామంలో వెలసిన కొఠారి చండీమాత యాత్ర శనివారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఒడిశా నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం రాత్రి ప్రభుత్వ విప్ బి.అశోక్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కవిటి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పూజలందుకున్న చండీమాత

## నేడు బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం

గార, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కె.మత్స్యలేశం (పోర్ట్ కళింగపట్నం)లో కల్యాణ మండపం ఎదురుగా ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షురాలు మైలపల్లి లక్ష్మీజనార్దన్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా తిమోతి

రణస్థలం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రణస్థలం, లావేరు మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ కార్యకవర్గం ఎన్నిక జిల్లా అధ్యక్షుడు డీఎస్‌వీఎస్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం డబ్లూఎంఈ చర్చ ప్రాంగణంలో జరిగింది. అధ్యక్షుడిగా తిమోతి, గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్ రూబేన్, ఉపాధ్యక్షుడిగా ఎం.జక్కయ్య, కార్యదర్శిగా ఎం.ఇశ్రాయేలు, ఉపకార్యదర్శిగా ఏఆర్ రెడ్డి, ట్రెజరర్‌గా వి.సురేష్, జాయింట్ ట్రెజరర్‌గా జి.జోషిబాబు, కార్యవర్గ సభ్యులుగా డి.రత్నం, ఏసుదాసు, ఎం.సైలస్, బి.శ్యామల్‌రాజు, సలహాదారులుగా సీహెచ్ సుధాకర్, వి.యేసురత్నం, జీఎస్ పాల్, ఎస్.శ్యామ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2025-27 వరకూ ఈ కార్యవర్గం కొనసాగుతుందని జిల్లా అధ్యక్షుడు డీఎస్‌వీఎస్ కుమార్ తెలిపారు.

## చర్చిలను పరిరక్షించుకోవాలి

చర్చిలను పరిరక్షించుకోవాలని జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి అన్నారు. శనివారం డబ్ల్యూఎంఈ చర్చలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అపరచిత వ్యక్తులు సంచిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఆదేవిధంగా విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

## ధర్మవరం పెద్ద చెరువు పరిశీలన

ఎచ్చెర్ల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పెద్ద చెరువును రెవెన్యూ సిబ్బంది శనివారం పరిశీలించారు. సర్వే నెంబరు 128లో 179 ఎకరాల విస్తీర్ణం గల పెద్ద చెరువులో పలు అక్రమాలు ఉన్నట్టు ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. చెరువులో ఆక్రమణలు ఏ మేరకు ఉన్నాయన్న విషయాన్ని చూశారు. ఈ చెరువు ఆక్రమణపై ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామని తహసీల్దార్ బి.గోపాల్ తెలిపారు. ఈ చెరువులో ఎవరెవరికి పట్టాలు ఉన్నాయన్న విషయాన్ని తెలుసుకుంటామన్నారు.

## పనుల్లో నాణ్యత పాటించాలి

కంచిలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు. పెద్ద శ్రీరాంపురం గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రెండో విడత మంజూరైన రూ.40లక్షలతో నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో మాదిన ప్రదీప్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే రీసర్వే

ఎచ్చెర్ల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రీ సర్వే చేస్తుందని ఆర్డీవో కె.సాయి ప్రత్యూష అన్నారు. చిలకపాలెంలో రెండో విడత భూ రీ సర్వేను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. మండలంలో 31 రెవెన్యూ గ్రామాలు ఉండగా, ఇందులో 15 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. రీ సర్వే జరిగేటప్పుడు సంబంధిత రైతులు రెవెన్యూ సిబ్బందికి సహకరించాలన్నారు. రీ సర్వే చేపట్టిన తీరును రైతులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బలగ గోపాల్, డీటీ త్రినాథరావు, రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు




కేదారిపురం దేవాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దేవాలాయాలు, చెర్చెలు, మశీదులలో నేరాల నియంత్రణలో భాగంగానే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీ కెమారాలు ఏర్పాటు చేస్తున్నామని రూరల్ ఎస్సై శ్రీనువాసరావు తెలిపారు కెమారాల ఏర్పాటులో భాగంగా శనివారం మండలంలో గల బాలకృష్ణాపురం, కేదారిపురం, బెనుగానిపేట పంచాయితీ పరదిదలో గల దేవాలయాల్లో గ్రామ పెద్దలు సహకారంతో సీసీ కెమారాలు ఏర్పాటు చేశామని రూరల్ ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు

# ఒక వైపు వేశారు.. మరోవైపు వదిలేశారు

●బెండి వద్ద అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు ●ఇదీ పూండి- పర్లాకిమిడి ఆర్అండ్‌బీ రోడ్డు పనుల దుస్థితి


బెండి వద్ద మధ్యలో నిలిచిన రోడ్డు పనులు

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బెండిమూడురోడ్లు కూడలిలో రహదారి పనులు ఒక వైపు కొంత మేర చేపట్టి, మరో వైపు విడిచిపెట్టడంతో వాహనచోదకులు, ప్రయాణికులు అగచాట్లకు గురవుతున్నారు. చీకటిపడిన తర్వాత వచ్చిపోయే వారు ప్రమాదాలకు గురవుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

పూండి-పర్లాకిమిడి ఆర్అండ్‌బీ రోడ్డు పనుల్లో భాగంగా కాశీబుగ్గ నుంచి వయా అక్కుపల్లి మీదుగా వజ్రపుకొత్తూరు వరకు రోడ్డు పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేశారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో నిధులు విడుదల చేయకుండా పనులు ప్రారంభించి మధ్యలో వదిలేయడంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. బెండి మూడురోడ్ల కూడలి వద్ద ఒకవైపు నిర్మించగా, మరో వైపు సిమెంట్ రోడ్డు పనులు మధ్యలో విడిచి పెట్టేయడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు.ప్రధానంగా ఇక్కడ ఒకవైపు వేసిన సిమెంట్ రోడ్డు అడుగు ఎత్తులో ఉండడం, రోడ్డుకు మరోవైపు పనులు చేపట్టకపోవడంతో కార్లు, బస్సులు, లారీ వటి భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ ఉండే పురాతన నందికేశ్వరాలయం దర్శనానికి ఒడిశాలోని వందలాది మంది భక్తులు వాహనాల్లో వస్తుంటారు. ఈనేపథ్యంలో ఒకవైపు రోడ్డును వేయకుండా విడిచిపెట్టడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. కాగా బెండి వద్ద మధ్యలో నిలిచిపోయిన రోడ్డు పనుల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చినట్లు ఆర్అండ్‌బీ డీఈ రవికాంత్ తెలిపారు. సీఆర్ఐఎఫ్ నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభించి పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

గార, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అంపోలు గ్రామానికి చెందిన పెదలాపు రమణ (57) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు ఎస్ఐ ఆర్.జనార్దన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. రమణ కొన్నాళ్లగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల ఒకటో తేదీన పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రమణకు భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## ప్రైవేట్ స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

● విద్యార్థితో పాటు మరో వ్యక్తికి గాయాలు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారి బెల్లుపడ జంక్షన్ స్కైడ్రాప్ వాటర్ ప్లాంట్ వద్ద ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు (అద్దె బస్సు)ను లారీ ఢీకొంది. ఈ ఘటనలో బస్సులో ఉన్న విద్యార్థితోపాటు మరో వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం ఉదయం లొద్దపుట్టికి చెందిన కొంతాల తరుష్ గొళంత్ర (ఒడిశా) గ్రామంలో గల ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. రోజూలాగానే శనివారం స్కూల్ బస్సులో వెళ్లి, తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అదే బస్సులో ఇంటికి చేరుకొనే క్రమంలో వాటర్ ప్లాంట్ వద్దకు చేరుకొనే సరికి భీమవరం నుంచి చేపల లోడ్‌తో ఒడిశా వైపు అతివేగంగా వచ్చిన లారీ ఈ బస్సును ఢీకొట్టింది. బస్సులో ఉన్న తరుష్, కృష్ణారావు గాయపడ్డారు. వీరిద్దర్నీ 108 వాహనంలో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పి.దేవేంద్ర రెడ్డి చికిత్స అందించారు. పాసింజర్ కృష్ణారావు పరిస్థితి విషమంగా ఉండడంతో బరంపురం ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అత్తవారి ఇంట మహిళ నిరసన


అత్తవారి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న రాణి, పిల్లలు

కోటబొమ్మాళి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరియాబొడ్డపాడు పంచాయతీ పరిధిలో గల బడ్డేపేటలో ఓ వివాహిత తనకు న్యాయం చేయాలని అత్తివారి ఇంటి వద్ద శనివారం నిరసన తెలిపింది. బాధితురాలి కథనం మేరకు... కోటబొమ్మాళి మండలంలోని బడ్డేపేటకు చెందిన ఉపాధ్యాయుడు మెట్ట గోపాలకృష్ణతో టెక్కలి మండలంలోని పోలవరానికి చెందిన చింతాడ వెంకటరమణ, భానుమతి కుమార్తె రాణితో 2017 మేలో వివాహం జరిగింది. వీరికి వేదిక, స్వాతిక అన్న ఇద్దరు ఆడ పిల్లలు జన్మించారు. ఇద్దరూ ఆడపిల్లలే కావడంతో అత్తమామలు విశ్రాంత ఉపాధ్యాయుడు అప్పలనాయుడు, ఢిల్లేశ్వరి రాణిని రెండేళ్లుగా ఇంటికి తీసుకురావడానికి అంగీకరించడంలేదు. దీంతో కన్నవారి ఇంట్లో పిల్లలతో ఉంటోంది. రాణి భర్త గోపాలకృష్ణ మెళియాపుట్టి మండలంలోని మురికింటిభద్రలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. ఏడాదిగా గోపాలకృష్ణతో మొబైల్‌లో మాట్లాడేందుకు రాణి ప్రయత్నిస్తోంది. అయితే ఆయన నెంబరును బ్లాకులో పెట్టేశాడు. ఈనేపథ్యంలో శనివారం పోలవరం నుంచి రాణి పెద్దమనుషులతో వచ్చింది. గ్రామంలో అత్తవారి ఇంటి ఎదుట పిల్లలతో కూర్చొంది. తలుపులు తీయాలని కోరినా తీయలేదు.దీంతో రాణి తరపున పెద్దమనులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.కాగా అత్తవారి ఇంట ఓ మహిళ నిరసన తెలియజేయడంపై ఫిర్యాదు అందిందని ఎస్ఐ వి.సత్యనారా యణ తెలిపారు.ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

## సర్పంచ్ మృతిపై దర్యాప్తు నిర్వహించండి


సీఐ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పలాస, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలంలోని నువ్వలరేవు సర్పంచ్‌గా వ్యవహరించిన బైనపల్లి రఘు మృతిపై కుటుంబ సభ్యులతోపాటు తమకు అనేక అనుమానాలు ఉన్నాయని, ఈవిషయంపై సమగ్రంగా దర్యాప్తు నిర్వహించాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, టీడీపీ నాయకులు సూరాడ మోహనరావు,కుత్తమ లక్ష్మణ్, పుచ్చ ఈశ్వరరావు కోరారు.ఈ మేరకు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణకు వినతిపత్రం శనివారం మధ్యాహ్నం సమర్పించారు. ఈ సందర్భంగా విఠల్‌రావు మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ 4న నువ్వలరేవు సమస్యలపై అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజుతో చర్చించేందుకు ఆయన కార్యాలయానికి వెళ్లి రఘు మాట్లాడారని, ఆ క్రమంలో ఇద్దరి మధ్య బేధాభిప్రాయాలు వచ్చాయని, మంత్రితో విబేధించిన రఘు డీఎస్పీకి సమస్య విన్నవించారని తెలిపారు. అనంతరం పలాస-కాశీబుగ్గలో రఘు శవంగా కనిపించాడని తెలిపారు. ఈ కేసు పునర్విచారణచేసి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరారని తెలిపారు.

## రాత్రి 11 తర్వాత తిరిగితే కేసులు: ఏఎస్పీ

టెక్కలి, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి):టెక్కలిలో రాత్రి సమయంలో ఖచ్చితమైన గస్తీ, పెట్రోలింగ్ చేపడతామని ఏఎస్పీ పి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇకనుంచి ఎటువంటి కారణం లేకుండా రాత్రి 11 గంటల తర్వాత బహిరంగంగా తిరిగిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితులు లేదా ఎమర్జెన్సీ సమయాల్లో ఆధారాలతో మాత్రమే రాత్రిపూట బయటకు రావాలని తెలిపారు.

## ఆలయాల భద్రతకు చర్యలు: ఎస్ఐ

హరిపురం,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి):ఆలయాలు, మసీదులు, చర్చిలు వంటి పుణ్యస్థలాల భద్రతపై ప్రజాప్రతినిధులు, యువత ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ సూచించారు. శనివారం మందస మండలంలోని సువర్ణాపురం, మఖరజోల, హరిపురంలోని ఆలయాలు, చర్చిలను సందర్శించారు. సువర్ణాపురంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు.ఈసందర్భంగా సర్పంచ్ వాసుకు కొత్తగా సీసీ కెమెరాలను అందజేశారు. కార్యక్రమంలో పోలీసులు ఢిల్లేశ్వరరావు, శిర్ల కృష్ణారావు పాల్గొన్నారు.

## ఆలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

హిరమండలం,ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హిరమండలంలోని సుభలయ ఆర్ఆర్‌కాలనీలో కొండజాతరమ్మ తల్లి ఆలయం, సుభలయ మసీదులో సీసీ కెమెరాలను శనివారం ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ ఎండీ యాసిన్ చెప్పారు. మండలంలో మిగిలిన ఆలయాలు, చర్చిల్లో కూడా కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు.

## మందసలో వైద్య పరీక్షలు

హరిపురం ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి):మందసలో ఉద్దానం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో శనివారం జెమ్స్ వైద్యులు ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో 254మందికి గుండె సంబంధిత, బీపీ,షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణరావు, మోనంగి నాగేశ్వరరావు, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

## సత్వరమే తాగునీరందించండి

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస,ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):జలజీవన్‌మిషన్ ద్వారాసత్వరమే తాగునీరం దించడానికి చర్యలు తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శనివారం శ్రీకాకుళంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో డీఈఈ సూర్యనారాయణ, జలజీవన్‌మిషన్ ప్రాజెక్ట్ డీఈఈ ఆశాలతతో ఆమె సమావేశం నిర్వ హించారు.ఈసందర్భంగా పలాస నియోజకవర్గంలో 19పంచాయతీల్లో మాత్రమే అరకొరగా పనులు చేశారని, మిగిలిన గ్రామాల్లో పనులు నాణ్యతతో పూర్తి చేసి అందించే బాధ్యత అధికారులదేనని తెలిపారు. ఆమె వెంట టీడీపీజిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు ఉన్నారు.

**ఇంటింటికి ట్యాంకర్లతో నీటి సరఫరా**

మునిసిపాలిటీకి ఉద్దానం నీరు వచ్చేవరకూ ట్యాంకర్లతో ఇంటింటికీ నీరు సరఫరాకు చర్యలకు ఆదేశించినట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. శనివారం పలాస-కాశీబుగ్గలోని 27వ వార్డు ఉల్లాసపేట కాలనీలో నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం వరకూ సీసీరోడ్డుకు శంకుస్థాపన చేయడంతోపాటు హడ్కోకాలనీలో నిర్మించిన పవర్ బోరు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీహయాంలోనే జంట పట్టణాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. వైసీపీ హయాంలో ఒక్క అభివృద్ధి పని పూర్తి చేయలేదని చెప్పారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయడానికి కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సహకారంతో రూ.48 కోట్లు విడుదలచేసినట్లు తెలిపారు. త్వరలో కేంద్రీయ విద్యాలయం నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, కౌన్సిలర్, గురిటి సూర్యనారాయణ, కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు,రవిశంకర్‌గుప్తా, మల్లా శ్రీనివాస్,నాగరాజు, సప్ప నవీన్, ఎం.నరేంద్ర, అంబటి కష్ణమూర్తి, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.

## పార్టీ విధేయులకే గుర్తింపు

● నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి కష్టపడేవారికే గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శనివారం నరసన్నపేటలోని క్యాంపు కార్యాలయంలో జలుమూరు, నరసన్నపేట మార్కెట్ కయిటీ చైర్మన్లగా నియమితులైన తర్ర బలరాం,పోగోటి ఉమామహేశ్వరి ఎమ్మెల్యేను అభినందించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి కష్టకాలం వరకు గ్రామాల్లో అటుపోట్లు ఎదుర్కొని నిలబడిన విధేయులకు టీడీపీ గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, శ్రీముఖలింగం, కంబకాయి గ్రామ టీడీపీ నాయకులు కృష్ణమూర్తి, మహేంద్ర, తమ్మగారి సతీష్ పాల్గొన్నారు.


బగ్గు రమణమూర్తిని అభినందిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్లు

## ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకించాలి

● సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్


మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

టెక్కలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అడవులను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆపరేషన్ కగార్‌ని దేశ ప్రజలు వ్యతిరేకించాలని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి పి.ప్రసాద్ కోరారు. శనివారం పలాసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టుల నుంచి అడవులను విముక్తిచేసే పేరిట మోదీ సర్కార్ తలపెట్టిన ఆపరేషన్ కగార్ వెనుక కార్పొరేట్లకు అడవులను కట్టబెట్టే రహస్య ఎజెండా ఉందన్నారు. లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపద గల అడవులను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకి అప్పగించడం కోసం ఆదివాసీలను, వారి పక్షాన పోరాడే మావోయిస్టులను పిట్టల్లా కాల్చి చంపడాన్ని ఖండించాలని కోరారు.న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయకార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ పలాసలో ఈనెల 13న పైల వాసుదేవరావు ఐదో వర్ధంతి సభను న్యూడెమొక్రసీ రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. సమావేశంలో జుత్తు వీరస్వామి, బాలకృష్ణ, జగన్ పాల్గొన్నారు.

## టీడీపీకి కుటుంబ సాధికారిక సారథులే కీలకం


కుటుంబ సాధికారిక సారథులను అభినందిస్తున్న వెంకటరమణ

జలుమూరు (సారవకోట) ఏప్రిల్ 5: టీడీపీకి కుటుంబ సాధికారిక సారథులే కీలకమని పార్టీ సారవకోట మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ తెలిపారు. శనివారం మండలంలోని క్లస్టర్ల-7 పరిధిలో గల వాండ్రాయి, కొమ్ముసరియాపల్లి, చిన్నగుజ్జువాడ, జమచక్రం, అన్నుపురం, రామకృష్ణాపురం, పెద్దలంబ, నవతల, కిడిమి, సారవకోట పంచాయతీల్లో గ్రామాల్లో కుటుంబ సాధికారిక సారథులను నియమించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి తాడేల భీమారావు, నాయకులు నాగరాజు, వెంకటేష్, రొక్కం చిరంజీవి, సాధు అప్పలనాయుడు, పి.రత్నాలనాయుడు శివ, హేమంత్, మహేష్, శంకర్, చంద్రమౌళి, రఘు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

## బాలికల భద్రతే ప్రభుత్వ ధ్యేయం: సీఐ


మాట్లాడుతున్న సీఐ తిరుపతిరావు

హరిపురం, ఏప్రిల్ 5: (ఆంధ్రజ్యోతి): బాలికల భద్రతే ప్రభుత్వ ధ్యేయమేని సీఐ తిరుపతిరావు తెలిపారు.శనివారం మందస మండలం జీఆర్‌పురంలోని కేజీబీవీ బాలికల పాఠశాల, కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా ఫోక్సో చట్టం, గృహహింసతో పాటు ప్రభుత్వం బాలికలు, మహిళల కోసం ఏర్పాటు చేసిన చట్టాలను వివరించారు. అనంతరం పాఠశాలలో భద్రతతపాటు సీసీ కెమెరాల ఏర్పాటు, పనితీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఎస్‌వో వాసంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జీవామృతం తయారీపై అవగాహన


జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాతపట్నం ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సహజసాగులోజీవామృతం క్రియాశీలక భూమిక పోషిస్తుందని ఎంఎంటీఎల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఆర్పీ రేణుక తెలిపారు. శనివారం మండలంలోని గంగువాడలో రైతులకు జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నేల సారం పెంచడంలో నత్రజని, భాస్వరం, పోటాషియం వంటి పోషకాలు జీవామృతం కలిగిఉండడం వల్ల మంచి ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు.

## స్వయం ఉపాధి మార్గాలు పెంపొదించుకోవాలి

నరసన్నపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి మార్గాలు పెంపొదించుకోవాలని సత్యసాయసేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు కోరారు. శనివారం స్థానిక బొడ్డవలసలో కంప్యూటర్, కుట్టు అల్లికలపై శిక్షణ పొందిన మహిళలకు గుర్తింపు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు కంప్యూటర్, కుట్టు తదితర స్వయం ఉపాధి మార్గాలను పెంచుకునేందుకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి మార్గాలను కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి నరసింహమూర్తి, సత్యసాయి సమితి కన్వీనర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## హరికృష్ణమ్మపేటలో కుంకుమ పూజలు


జలుమూరు: సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

జలుమూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని హరికృష్ణమ్మపేటలో గల కోదండరామాలయం ఆవరణలో శనివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ 15వ వార్షికోత్సవం, శ్రీరామనవమి పురస్కరించుకొనిగ్రామ పురోహితులు అక్కాజోష్యుల రాజశేఖర శర్మ నేతృత్వంలో తొలుత గణపతిపూజ, పుణ్యాహవచనం, పరిషత్, రక్షాబంధన్, అంకురార్పన, మండపారాధన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.కుంకుమ పూజల్లో హరికృష్ణమ్మపేటతోపాటు దరివాడ, లింగాలవలస, ఉసిరికిజోల మహిళలు,కమిటీ సభ్యులు నూకయ్య దంపతులు పాల్గొన్నారు.

**ఊడికలపాడులో గాయత్రీ మహాయజ్ఞం**

కోటబొమ్మాళి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఊడికలపాడులోగల శ్రీరామ క్షేత్రంలో కోటబొమ్మాళి ఆర్యసమాజం ఆధ్వర్యంలో శనివారం గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ధర్మకర్త సనపల కరుణ్‌కుమార్ సదుపాయాలు కల్పించారు.

**సీతారాముల కల్యాణానికి పెళ్లిరాట**

హిరమండలం,ఏప్రిల్5:(ఆంధ్రజ్యోతి)హిరమండలం బ్యారేజీ సెంటర్‌లో ఉన్న రామాలయంలో ఆదివారం నిర్వహించే సీతారాముల కల్యాణానికి శనివారం పెళ్లిరాట మహోత్సవం, హోమం నిర్వహించారు.తొలుతఆలయాన్ని పచ్చతోరణలు, విద్యుత్ దీపాలతో ముస్తాబుచేశారు. ఆదివారం శ్రీరాముని పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు అర్చకులు శ్రీనివాసశర్మ చెప్పారు.

## నేడు కవి సమ్మేళనం

పలాస/రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పలాస లయన్స్‌క్లబ్ సమావేశమందిరంలో శ్రీరామనవమి పురస్కరించుకుని జనజాగృతి సాహితి సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఉత్కళాంధ్ర(ఆంధ్ర-ఒడిసా) ఆహ్వానిత కవి సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకుడు, రాష్ట్ర జానపదకళాసంస్థ అధ్యక్షుడు కుమార్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హాజరయ్యే కవులకు సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

నందిగాం/పాతపట్నం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నందిగాం, పాతపట్నం బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష ఈనెల 13వ తేదీకి వాయిదా పడినట్లు ప్రిన్సిపాళ్లు ఎస్.వాణి, వి.అర్చన శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆదివారం జరగాల్సిన ఈ పరీక్షను రాష్ట్ర అధికారుల సూచనల మేరకు వాయిదా వేశామని పేర్కొన్నారు. 13వ తేదీ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఐదో తరగతికి, మధ్యాహ్నం రెండునుంచి సాయంత్రం 4.30గంటల వరకు ఇంటర్‌కు సంబంధించి పరీక్ష జరుగుతుందని తెలిపారు.

## గులివిందలపేటలో బాలికకు ఆసరా

కొత్తూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గులివిందలపేట గ్రామానికి చెందిన బాలిక ఈసర్ల అవనిక తల్లిదండ్రులను కోల్పోయి ఆపన్న హస్తంకోసం ఎదురు చూస్తుండడంతో ఆదే పంచాయతీకి చెందిన వ్యాపారవేత్త బామిడి రాజు ఆసరాగా నిలిచారు. అవనిక తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందడంతో నాన్నమ్మ సంరక్షణలో కొంతకాలం పెరిగింది.నాన్నమ్మ కూడా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతిచెందింది. దీంతో ఎవరు లేకపోవడం, ఆదరణకు నోచుకోకపోవడంతో బామిడి రాజు అవనికకు రూ.ఐదు వేలుఅందజేశారు.విశాఖలోని భీమిలిలో గల అనాథాశ్రమంలో చేర్పిస్తానని, లేదంటే అవనిక కోరుకున్న చోట ఉన్నత చదువులు చదివించేందుకు అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన గ్రామస్థులకు భరోసాఇచ్చారు

## పోటీ పరీక్షలకు సిద్ధంకావాలి

పలాస,ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధంకావాలని ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలోవైస్‌ప్రిన్సిపాల్‌గణపతిరావు, మధు, పి.వెంకటరమణ, శ్రీనివాస్‌పట్నాయక్, నర్సింహులు, హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జేఎస్‌వీ కీర్తి పాల్గొన్నారు.

# బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి

●జిల్లాలో ఘనంగా జయంతి


శ్రీకాకుళం అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎస్పీ రమణ


ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో నివాళులర్పిస్తున్న వీసీ రజని

దివంగత కేంద్ర మాజీ మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలతోపాటు ప్రధాన కూడళ్లలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఏఎస్పీ కేవీ రమణ, వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, శ్రీకాకుళంలోని జ్యోతిరావు పూలేపార్కులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాశీబుగ్గ సంతమైదానం ఆవరణలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే గౌతు శిరీష పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



శ్రీకాకుళం కలెక్టరేట్: కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి


రణస్థలం:క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు